## పొన్నమానుసేవ ఉత్సవంలో ఆత్మారామస్వామి



సంగం జూన్ 24 ప్రభాతవార్తసంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలో శ్రీసీతా లక్ష్మణ సమేత ఆత్మారామస్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా పొన్నమానుసేవ అత్యంత వేడుకగా నిర్వహించారు. స్వామి వారు పొన్నమానుసేవ ఉత్సవంలో శ్రీకృష్ణ పరమాత్మగా భక్తులకు దర్శనమిచ్చారు.స్వామి వారిని సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు.ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా కీర్తిశేషులు చెవ్వల శ్రీనయ్య అండ్ సన్స్, చెవ్వల రాధయ్య అండ్ సన్స్, జీనిగలగోపాలయ్య, బైనబోయిన రమణయ్య, బైనబోయిన శ్రీనివాసులు,బైనబోయినరాజగోపాల్ వ్యవహరించారు.పూజా కార్యక్రమాలను ఆలయఅర్చకులువేదగిరి సత్యనారాయణచార్యులు, రాజకుమార్ స్వామి,వేదగిరి భరత్‌స్వామి నిర్వహించారు.

## అరటితోట రాజీవ్‌నగర్‌లో ఉద్యోగి నివాసంలో చోరీ

### మూడు లక్షల రూపాయల నగలు, నగదు అపహరణ



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త** కావలి పట్టణ అరటితోట రాజీవ్‌నగర్‌లోని సుదర్శన్ ఉషశ్రీ నివాసంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి ఇంటి తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. దాదాపు 3 లక్షల రూపాయల పైచిలుకు విలువ చేసే బంగారు నగలు,నగదును దుండగులు అపహరించారు. ఇంటి యజమాని సోదరి గుత్తి జ్యోతి సోమవారం కావలి వన్‌టౌన్‌లో చేసిన ఫిర్యాదును పురస్కరించుకొని పోలీసులు రంగ ప్రవేశం చేశారు. కావలి వన్ టౌన్ సిఐ రాజేష్ సమాచారం మేరకు గుర్తు తెలియని దుండగులు మెయిన్ డోర్ తాళం పగులగొట్టి ఇంటి లోనికి ప్రవేశించారన్నారు. బీరువాలు పగులగొట్టి బీరువా లాకర్‌లో వున్న నాలుగున్నర సవర్ల తూకం కల్గిన బంగారు నగలు, 50 వేల నగదు దుండగులు అపహరించారని తెలిపారు. సంఘటన ప్రదేశాన్ని పోలీస్ సిబ్బందితో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రాజేష్ పరిశీలించారు. క్లూస్ టీం బృందం వేలిముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి యజమానురాలు సుదర్శన్ ఉషశ్రీ విజయవాడలో ఉద్యోగం చేస్తున్నారని సిఐ తెలిపారు. రాజీవ్‌నగర్ అరటితోటలో చోరీ జరిగిందన్న సమాచారం దావాలనంలా వ్యాపించడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు.

## గ్రీవెన్స్ సెల్‌లో అర్జీలు స్వీకరించిన ఎస్పీ



నెల్లూరు క్రైం, జూన్ 24, ప్రభాతవార్త సుమారు మూడు నెలల తర్వాత స్థానిక ఉమేష్ చంద్ర సమావేశ మందిరంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పి కె. ఆరీఫ్ హఫీజ్ ఫిర్యాదులను స్వయంగా స్వీకరించి, క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు సత్వర న్యాయం చేసేలా ఆయన ఆదేశాలు జారీ చేశారు. బ్యాంక్, ఇతర ప్రభుత్వ రంగాలలో ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షలు కాజేసే వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు వంటి కేసులలో అలసత్వం లేకుండా త్వరితగతిన చర్యలు చేపట్టాలన్నారు. చిన్న పిల్లలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సమస్యలపై తక్షణం స్పందించండి. తగిన చర్యల ద్వారా వారికి ఉపశమనం కలిగించాలని సిబ్బందికి సూచించారు. మహిళా వేధింపులు, కుటుంబ తగాదాలు వంటి సున్నిత అంశాలలో కౌన్సెలింగ్ నిర్వహించి కాపురాలు చక్కబడేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనధికార చీటీలు, ఉద్యోగాల పేరుతో మోసం, సైబర్ నేరాలు, మిస్సింగ్, కుటుంబ కలహాలు, నమోదైన కేసులలో పురోగతి, తల్లి దండ్రులు వేధింపులు, భర్త, అత్తారింటి వేధింపులు, భూ, ఆస్తి వివాదాలు, నకిలి పత్రాలు, అధిక వడ్డీలు తదితర సమస్యల ఫిర్యాదులు స్వీకరించారు.

## విపిఆర్ ప్రమాణ స్వీకారంలో కుటుంబ సభ్యులు



నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త - వైద్యం తెలుగుదేశం పార్టీ కూటమి నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి పార్ల మెంట్లో సోమవారం జరిగిన కార్యక్రమానికి కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు. వేమిరెడ్డి సతీమణి కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, తనయులు అర్జున్ రెడ్డి, కుటుంబ సభ్యులు హనీష్ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ మంత్రిని సన్మానించిన పోలంరెడ్డి



కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అచ్చెన్నాయుడును కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలు కలిసి శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. కోవూరుకు సంబంధించిన పలు విషయాలపై ప్రత్యేకంగా చర్చించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణచైతన్య, తదితరులు ఉన్నారు.

## మంత్రి సత్యకుమార్ యాదవ్‌ని కలిసిని ఏపీఎన్‌జీజీఓస్ అసోసియేషన్



నెల్లూరు అర్బన్,జూన్24,ప్రభాతవార్త : ఆరోగ్య కుటుంబసంక్షేమ,వైద్య,విద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కలిసిన ఏపీఎన్‌జీజీఓస్ అసోసియేషన్ సభ్యులు సత్యకుమార్ యాదవ్‌ని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏపీఎన్ జీజీఓస్ అసోసియేషన్ శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జల్లా అధ్యక్షులు మన్నేపల్లి పెంచలరావు,రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ,సతీష్ మొదలైనవారు పాల్గొన్నారు

# శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## కేబినెట్ సమావేశంలో నారాయణ



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త - వైద్యం** అమరావతి వెలగపూడి సచివాలయం లోని మొదటి బ్లాక్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం తొలి కేబినెట్ ప్రారంభమైంది. ఈ కేబినెట్‌లో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రులతో చంద్రబాబు భేటీ అయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పాల్గొన్నారు.

## ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసిన విపిఆర్



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త –** వైద్యం ప్రభాకర్ రెడ్డి వేమి రెడ్డి అను నే ను, లోక్ సభ సభ్యుడిగా ఎన్నికైనందున శాసనం ద్వారా నిర్మితమైన భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం విధేయత చూపుతానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని నేను స్వీకరించబోయే కర్తవ్యాన్ని శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తానని దైవసాక్షిగా ప్రమాణం చేస్తున్నాను అంటూ నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి లోక్ సభలో ప్రమాణ స్వీకారం చేసారు. 18వ లోక్ సభ ప్రారంభమైన నేపథ్యంలో తొలిగా ప్రొటెం స్పీకర్‌గా భర్తుహరి మహతబ్‌ని ఎన్నుకోగా ఆయన చేత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం సభలో సోమవారం ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు.

## డయేరియా ప్రబలకుండా జాగ్రత్తలు వహించండి:కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 24,ప్రభాతవార్త:** డయేరియా వ్యాధి ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని,నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో గడపగడపకు పర్యటించి త్రాగునీటిశుద్ధత పై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య కార్యదర్శి ఆదేశముల మేరకు,జిల్లా కలెక్టర్ సూచనల మేరకు నగర పాలక సంస్థ ఇంచనీరింగ్,ప్రజారోగ్యం విభాగాల అధికారులు,సచివాలయం వివిధ విభాగాల కార్యదర్శులతో డయేరియా నివారణ అంశంపై సమీక్షా సమావేశాన్ని కార్యలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు.ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ డయేరియా లక్షణాలను పరీక్షించాలని సూచించారు. కలుషిత నీటి సరఫరాను పునరుద్ధరించడానికి ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని ఆదేశించారు.నగర పాలక సంస్థ పరిధిలో అన్ని డివిజనుల్లో క్రమం తప్పకుండా ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అయ్యే త్రాగునీరు ప్రమాణాలను పరీక్షించి నివేదికలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు.వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేయడం,వివరాలు నమోదు చేయడం,త్రాగునీటిలో క్లోరినైజేషన్ ప్రక్రియను క్రమంతప్పకుండా అమలు చేయడం ట్యాంకు పరిసరాలను బ్లీచింగ్ చేయడం,త్రాగునీటి సరఫరాలో లీకేజీలు గుర్తించి తగిన రిపేర్లు చేయడం,డ్రైను కాలువలకు సమాంతరంగా ఉన్న త్రాగునీటి లైన్లను గుర్తించి పునరుద్ధరించే చర్యలను తీసుకునేలా కమిషనర్ ఆదేశించారు.గడప గడపకు తిరిగి త్రాగునీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని,నీటిని వేడి చేసి చల్లార్చిన తర్వాతే స్వీకరించాలని ప్రజలకు అవగాహన పెంచాలని తెలిపారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం,చేతులను క్రమంతప్పకుండా పరిశుభ్రం చేసుకోవడం వంటి చర్యలను అలువాటు చేసుకునేలా చైతన్య పరిచేలా అవగాహన పెంచాలని కమిషనర్ ఆదేశించారు.పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని యూనిట్ గా చేస్తూ సచివాలయం అమెనాటీస్ హెల్త్ కార్యదర్శులను బృందంగా ఏర్పాటు చేసి డయేరియా లక్షణాలు ఇంటింటి వివరాలను గుర్తించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.నగర వ్యాప్తంగా ఉన్న ప్రజా మరుగుదొడ్ల నిర్వహణపై ఇంజనీరింగ్ విభాగం అధికారులు తనిఖీలు నిర్వహిస్తూ పరిశుభ్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు.ఈ సమావేశంలో ఇంజనీరింగ్ ఎస్.ఈ సంపత్ కుమార్,రమేష్,సిటీ ప్లానర్ దేవి కుమారీ,ఆరోగ్యశాఖాధికారిడాక్టర్ వెంకట రమణ జిజియా బాయి,మెడికల్ ఆఫీసర్లు, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగం అధికారులు,సచివాలయం అమెనిటీస్,హెల్త్ విభాగం కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కార వేదికకు శ్రీకారం





**నెల్లూరు అర్బన్,జూన్24,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ఆదేశాల మేరకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ నిర్వహించారు.మొదటిరోజే ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలకు సంబంధించిన అర్జీలను అందజేశారు.కలెక్టర్ హరినారాయణన్,జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్,డిఆర్ఓ లవన్న, జడ్పీ సీఈఓ కన్నమనాయుడు ప్రజా సమస్యల పరి ష్కార వేదిక కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేసి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు .స్కూల్, హాస్టల్ ప్రవేశాలు, పెన్షన్లు ,ఇరిగేషన్, హౌసింగ్, భూ సమస్యలు, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి ,తదితర శాఖల సంబంధించి ప్రజల నుండి అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి సాంబశివారెడ్డి,డిపిఓ సుస్మిత ,డిఎం హెచ్వో పెంచలయ్య, ఇరిగేషన్, విద్యుత్‌శాఖల ఎస్ఈలుకృష్ణమోహన్, విజయన్, సమగ్ర శిక్షపిఓ ఉషా రాణి,డిటిసి చందర్, మత్స్యశాఖ ,పశు సంవర్ధక శాఖ, జేడీలు నాగేశ్వరరావు ,మహేశ్వరుడు ,డిసిహెచ్ఎస్ రమేష్‌నాథ్,హౌసింగ్,మెప్మా,డ్వామా, ఇసి డిఎస్ పీడీలు నాగరాజు,రవీంద్ర,వెంకట్రావు,హేనా సుజన్,బీసీ,ఎస్సీ వెల్ఫేర్ అధికారి వెంకటయ్య తదితర జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నూతన సాంప్రదాయానికి జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు చొరవ



కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త : ఉమ్మడి జిల్లాలోని ఇటీవల గెలుపొందిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇటీవల తాడేపల్లిలోని వీపీఆర్ నివాసంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన సాంప్రదాయానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపారు. ప్రతి నియోజకవర్గంలో ఆ నియోజకవర్గ ఎమ్మెల్యే సుప్రీమ్ అని, వేరే నియోజకవర్గం వారు ఆ నియోజకవర్గ అభివృద్ధి పనులు విషయంలో చొరవ తీసుకోకూడదని నిర్ణయించుకున్నారు. అదే విధంగా గతంలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో ఇబ్బందులు పెట్టిన అధికారులను ఒక నియోజకవర్గంలో వద్దు అని పంపించిన అధికారిని మరో నియోజకవర్గంలో ప్రోత్సహించరాదని ఈ సందర్భంగా ప్రజాప్రతి నిధులు నిర్ణయం తీసుకోవడం సర్వత్రా హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయి. ముఖ్యంగా ప్రతి నెల ఒక్కొక్క ఎమ్మెల్యే కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు సమావేశమై అభివృద్ధి పనులు, ప్రభుత్వ కార్యక్రమాలు ఏ విధంగా చేయాలి అనే అంశాలపై చర్చించడం శుభపరిణామమని ఒక సీనియర్ రాజకీయ నాయకుడు అభినందించారు. ఉమ్మడి జిల్లాలో ప్రజాప్రతినిధులు, మంత్రులు తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రానికే ఆదర్శం కావాలని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొత్తం మీద తాడేపల్లిలోని వీపీఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో పాటు మంత్రులు పొంగూరు నారాయణ, ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, కాకర్ల సురేష్, ఇంటూరి నాగేశ్వరరావు, కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్‌కుమార్, నెలవల విజయశ్రీ పాల్గొని తొలిసారిగా జరిగిన ఈ కార్యక్రమాన్ని సమిష్టిగా విజయవంతం చేయడం పట్ల జిల్లాలో సర్వత్రా హర్షాతిరేఖాలు వ్యక్తం అవుతున్నాయి.

## హింసాత్మక ఘటనపై ఎస్పీకి వైసిపి నేతల ఫిర్యాదు



**నెల్లూరు క్రైం, జూన్ 24, ప్రభాతవార్త** జిల్లాలోని పలుచోట్ల వైసిపి శ్రేణులు పై హింసాత్మక సంఘటనలు జరుగుతున్నాయంటూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎంపి ఆదాల ప్రభాకర్ రెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షుడు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తదితరులతో కూడిన బృందం సోమవారం జిల్లా ఎస్పి ఆరిఫ్ హఫీజ్‌కు ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ జిల్లాలో వైసిపి నాయకులు, కార్యకర్తల లక్ష్యంగా చేసుకొని చేస్తున్న దాడులపై ఫిర్యాదు చేశామన్నారు. జిల్లాలో ప్రజాస్వామ్యంకు పాతరవేస్తున్న అధికార పార్టీ నేతల వ్యవహార శైలి పై చర్యలు తీసుకోవాలని ఎస్పికి విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎటువంటి హింసాత్మకమైన సంఘటనలను ఉపేక్షించే ప్రసక్తే లేదని, ఎవరు కూడా ఇటువంటి బెదిరింపులకు భయపడవద్దని తమ ఫిర్యాదు పట్ల ఎస్పి సానుకూలంగా స్పందించారని తెలిపారు. నెల్లూరు రూరల్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 25 ఏళ్ళ తన రాజకీయ జీవితంలో ఏనాడు కూడా ఇటువంటి నీచమైన హింసాత్మకమైన సంస్కృతిని, సాంప్రదాయాలను చూడలేదన్నారు. కేవలం ఎన్నికల అప్పుడు మాత్రమే ప్రత్యర్థులుగా ఉండి ఎన్నికల అనంతరం స్నేహభావంతో ఒకరితోఒకరు కలిసిమెలిసిపోయేవాళ్ళమని కానీ నేడు అందుకు భిన్నంగా ఎన్నికల్లో ఓడిన ప్రత్యర్థి పార్టీల నాయకులు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకొని కక్షసాధింపు చర్యలు, అదిరింపులు, బెదిరింపులు, దౌర్జన్యాలు చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసినట్లు అవుతుందని చెప్పారు. వీటిన్నిటి పైన జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేయడం జరిగిందని అందుకు జిల్లా ఎస్పి సానుకూలంగా స్పందించి ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ ఒక్కరికి కూడా అన్యాయం జరగకుండా చూస్తానని స్పష్టమైన హామీ ఇవ్వడం సంతోషకరమని అన్నారు. ఎన్నికల అనంతరం జిల్లాలో జరుగుతున్న హింసాత్మకమైన సంఘటనపై జిల్లా ఎస్పిని కలిసి పూర్తి వివరాలను తెలియజేయడం జరిగిందని తెలిపారు. ఎస్పిని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో ఎమ్మెల్యే మేరిగ మురళీధర్, విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్నాటి కోటేశ్వర రెడ్డి, మల్లు సుధాకర్ రెడ్డి, బొబ్బల శ్రీనివాస యాదవ్, వెంకట శేషయ్య, భాస్కర్ గౌడ్, వైవి రెడ్డి, శ్రీధర్ బాబు ఉన్నారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి :కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 24,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. కమిషనర్ వికాస్ మర్మత్ పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు.ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల అనంతరం తొలిసారిగా ప్రజా వేదికను నిర్వహిస్తున్నామని తెలిపారు.మౌలిక సదుపాయాల కల్పన,స్థలాలు,కాలువలపైన ఆక్రమణలు,జగనన్న కాలనీ స్థలాలు,టిడ్కో గృహాల కేటాయింపు,కచ్చా కాలువుల,డ్రైనేజీ సౌకర్యాలు,మంచినీటి కల్వర్టులు, నూతన రోడ్ల నిర్మాణం,ప్యాచ్ వర్క్ పనులు వంటి అంశాలపై ప్రజా వేదికలో అందుకున్న సమస్యలకు సత్వరమే పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని,అన్ని డ్రైను కాలు వల్లో పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు.విభాగాల వారీగా రెవెన్యూ 1-,ఇంజనీరింగ్ -6, ప్లానింగ్-9,హౌసింగ్-5,పబ్లిక్ హెల్త్-1, అకౌంట్స్ -6 ఆప్కాస్-2,మొత్తం 30 వినతులను స్పందనలో అందుకున్నారు.అందుకున్న వినతులు పూనరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్.ఈ సంపత్ కుమార్,సిటీ ప్లానర్ దేవీ కుమారీ,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణ ఇతర అన్ని విభాగాల ,అధికారులు ,సూపరింటెండెంట్లుసిబ్బంది పాల్గొన్నారు.

## గుండుపల్లిలో దాహం...దాహం...



**సీతారామపురం జూన్ 24 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని గుండుపల్లి గ్రామ పంచాయితీలో గత 4 రోజులుగా నీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు. పంచాయితీ సెక్రటరీకి ఎన్ని సార్లు విన్నవించుకున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. విధి లేక స్థానిక రైతుల పొలం నుండి ప్రజలు నీరు తెచ్చుకుంటున్నారు. గుండుపల్లి హరిజనవాడలో ఒక మోటారుకు ప్యానల్ బోర్డు ఇప్పి సుమారు 9 నెలలు అయింది. ఇప్పటి వరకు దానిని బిగించిన దాఖలాలు లేవు. వైర్లు ఒపన్‌గా ఉన్నాయి.గత వారంలో ఒ మహిళ వైరు కనక్షన్ ఇస్తుండగా షాక్ తగిలింది.ఈ విషయాన్ని పంచాయితీ సెక్రటరీకి ఎన్ని సార్లు విన్నవించుకున్న కనీసం గ్రామానికి వచ్చి కూడా చూడలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు పంచాయితీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## సుధాకర్‌రెడ్డికి నివాళులర్పించిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** బామా వ్యవస్థాపక కార్యదర్శి, నా ఫౌండేషన్ చైర్మన్, విశ్రాంత ఆంధ్రబ్యాంక్ ఉద్యోగి లేబాకుల సుధాకర్‌రెడ్డి మృతదేహాన్ని కావలిలోని ఆయన నివాసంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. ఆయన మృతదేహంపై పూలమాల వుంచారు. సుధాకర్‌రెడ్డి మంచితనాన్ని కొనియాడారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట డాక్టర్ బెజవాడ రవికుమార్, వైశ్య నేత తటవర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ కాలువ పనులు పునరుద్ధరణ



**అనుమసముద్రంపేట, జూన్24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలో డ్రైనేజ్ కాలువ పనులను సోమవారం పునరుద్ధరించారు. గత ఎనిమిది నెలల క్రితం రోడ్డు ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ కాలువ పనులను కాంట్రాక్టర్ చేపట్టారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పటినుంచి కాలువ పనులను కాంట్రాక్టర్ నిలిపివేశారు. ఈమేరకు పనులు ఎక్కడి అక్కడే ఆగిపోవడంతో మురికి నీరురోడ్లపైకి రావడంతో ప్రజలు తీవ్ర అవస ్థలు పడుతున్నారు. ఈమేరకు ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళడంతో వెంటనే స్పందించిన గ్రామ సర్పంచ్ షేక్ జిలానీబాషా , ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ వెంకటేశ్వర్లు, ఎఇ, గ్రామ కార్యదర్శి పరిశీలించారు. ఈమేరకు పనులను వెంటనే ప్రారంభించి మురికి నీటిని రోడ్లపైకి వెళ్ళకుండా చర్యలు చేపట్టారు. గ్రామంలో డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ఘనంగా అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే



**అనుమసముద్రంపేట, జూన్24, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఏఎస్‌పేటలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బడిబాట, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేసి ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, కస్తూరి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుశీలమ్మ, విజయలక్ష్మి, సావిత్రి, షాకీర, విద్యార్థుల తల్లిదండ్రులు , ఆయాలు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్‌డే ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**ఉదయగిరి, జూన్24, ప్రభాతవార్త :** మండలకేంద్రమైన ఉదయగిరిలోని తహాశీల్దార్ కార్యాలయంలో గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని ఉదయగిరి తహాశీల్దార్ నెహ్రూ బాబు నిర్వహించారు.మండలంలోని పలు శాఖలకు సంబంధించిన అధికారులు ఈ కార్యక్రమానికి హాజరైయ్యారని ఆయన తెలిపారు.పలు రకాలు భూములకు సంబంధించిన సమస్యలను అర్జీ రూపంలో ప్రజలు అందజేశారని ఉన్నత అధికారుల మేరకు త్వరితగతిన సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్ట మొదటిగా ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌డే అని గత ప్రభుత్వంలో స్పందన ఉన్న కార్యక్రమాన్ని పేరును మార్పు చేసి గ్రీవెన్స్ డేగా పేరు మార్చారని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

## గండిపాలెంలో మలేరియా నివారణ చర్యలు



**ఉదయగిరి, జూన్24, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలోని గండిపాలెంలో వైద్యశాఖ అధికారులు పంచాయతీశాఖ అధికారులు గ్రామంలో రెండు గ్రూపులు గా ఏర్పడి సీజనల్ వ్యాధులైన మలేరియా పట్ల ్రపజలు అప్రమత్తంగా ఉండాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి చుట్టూ నిలువ నీరు ఉండకుండా చూసుకునే విధంగా జాగ్రత్తలు వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి అమర్నాథ్‌రెడ్డి మాట్లడుతూ జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశాల మేరకు గ్రామంలో సర్పంచ్ జి.కల్పన సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ రవి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులైన మలేరియా పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.గ్రామంలో ఎక్కడా కూడా మురుగునీరు ఉండకుండా ఇంతకీ నేను జాగ్రత్తగా తీసుకోమని ప్రజలను కోరామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ,ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## అధ్వాన్నంగా దగదర్తి వెలుపోడు ఆర్‌అండ్‌బి రోడ్డు



**దగదర్తి, జూన్ 24 ప్రభాతవార్త :** దగదర్తి నుంచి వెలుపోడు వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు గుంతలమయమై అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డులో పెద్దపెద్ద గుంతలు వుండటంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మబ్బుగుంట పాలెం, వెలుపోడు నుండి దగదర్తికి వచ్చే ద్విచక్రవాహనదారులు ఈ రోడ్డు దెబ్బతిని వుండటంతో గుంతల్లో పడి గాయాలపాలవు తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డును పట్టించుకున్న వారే లేరని ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో అయితే ఈ రోడ్డులో ప్రయాణం నరకయాతనే అంటున్నారు. వర్షపు నీటితో ఏది గుంటో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా కొత్తగా వచ్చిన ఈ ప్రభుత్వం ఈ రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.

## గోశాలలోని గోవులకు పశుగ్రాసాన్ని దాతలు అందించండి

**బిట్రగుంట, జూన్ 24 ప్రభాతవార్త :** బోగోలు మండలం కొండబిట్రగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థాన దిగువ భాగాన వున్న గోశాలలోని గోవులకు పశుగ్రాస కొరత ఏర్పడిందని దాతలు ఎవరైనా ముందుకు వచ్చి గడ్డి సమకూర్చాలని దేవస్థాన ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ శ్రీరాంమాల్యాద్రి విజ్ఞప్తి చేశారు. గోశాలకు సంబంధించిన గడ్డి వామి ఇటీవల తగలబడిందని దీంతో శాశ్వత గడ్డి వామికి గిడ్డంగిని ఏర్పాటు చేస్తున్నామని కావున దాతలు ముందుకు వచ్చి తమ సహకారాన్ని అందించాలని కోరారు.

## మందాటి చెరువులో ఆక్రమణలు తొలగించాలి

**కావలి, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి పట్టణంలోని మందాటి చెరువులో వెంటనే ఆక్రమణలను తొలగించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లి, రైతు సంఘం నేత కనుమూరు భాస్కర్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. సోమవారం కావలి ఆర్డీవో కార్యాలయ ఆవరణలో రైతు నేత భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. కావలి ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ముసునూరు ప్రాంతంలోని మందాటి చెరువు వద్ద చుట్టుపక్కల వ్యాపార సంస్థలు ఏర్పాటు చేసుకున్నారన్నారు. చెరువు పోరంబోకు భూములలో వందల అంగళ్లు, బ్రాందీ షాపులు ఏర్పాటు చేసుకున్నారన్నారు. చెరువు లోపల అక్రమ కట్టడాలు వెలిశాయన్నారు. చెరువు ఆక్రమణకు గురికావడంతో చుట్టుపక్కల నీటి సమస్య ఏర్పడుతుందన్నారు. తాగునీటి కోసం ప్రజలు తల్లడిల్లిపోతున్నారన్నారు. వైసిపి పాలనలో రెవెన్యూ అధికారుల సహకారంతో మందాటి చెరువు ఆక్రమణకు గురైందన్నారు. పెద్ద అంగళ్ళతో చెరువు లోపల, బయట, అక్రమ కట్టడాలు చోటుచేసుకున్నాయన్నారు. మందాటి చెరువులోని ఆక్రమణదారుల బిల్డింగ్‌లు పగులగొట్టి చెరువును శుభ్రం చేసి 15 రోజులలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాపిరెడ్డి చెరువులోని ఆక్రమణలు తొలగించి చెరువులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో శీనానాయక్ మాట్లాడుతూ చెరువు భూములు పరిరక్షించేందుకు 5 కమిటీలు వేశామని తెలిపారు. చెరువు భూములు పరిరక్షిస్తామని హామీ ఇచ్చారు. మందాటి చెరువు, పాపిరెడ్డి చెరువుల్లోని ఆక్రమణల్ని తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్.ఎస్.రమణయ్య, దుగ్గిరాల జార్జి, ప్రసాద్‌రెడ్డి, రమణయ్య, హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీనగర్‌లో చిన్నారులకు బడిబాట కార్యక్రమం



**నెల్లూరు, జూన్24 ప్రభాతవార్త-విద్య :** నగరంలోని స్థానిక గాంధీనగర్ పరిధిలోని చైతన్యపురి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు బడిబాట, గ్రాడ్యుయేషన్ డే వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ ఎం. సుజాత మాట్లాడుతు మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ సెంటర్‌లకు పంపాలని పిలుపునిచ్చారు.అంగన్వాడి సెంటర్స్ ద్వారా చిన్నారులకు , బాలింతలకు ప్రభుత్వం పౌష్టిక ఆహారం అందించటం జరుగుతుందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని. అనంతరం వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, డయేరియా నివారణ చర్యలు తదితర వాటిపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు డి.సుజాత, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

## ఈ భవనాన్ని వినియోగించుకోరా? అధికారులూ స్పందించరూ..



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** కోవూరులోని శాంతినగర్ ప్రాంతంలో గత 25 సంవత్సరాల క్రితం ఎంతో నాణ్యంగా అందరికి ఉపయోగపడేలా ప్రభుత్వ నిధులు వెచ్చించి మహిళా మండలి భవనాన్ని నిర్మించారు. కొంత కాలం పాటు పొదుపు గ్రూపులు ఈ భవనాన్ని తమ ఆనరా కార్యక్రమానికి వాడుకొన్నారు. అనంతరం కొద్ది రోజులు పాటు మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమం కూడా ఈ భవనంలో ఏర్పాటుచేశారు. అనంతరం గత సంవత్సరం కాలంగా ఈ మహిళా మండలి భవనం ఏ కార్యక్రమానికి ఉపయోగపడక నిరుపయోగంగా పడివుంది. ప్రస్తుతం మండల పరిషత్ అధికారులు ఈ భవనంలో మహిళల కోసం కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. అప్పుడప్పుడు ఈ భవనాన్ని అసాంఘీక కార్యక్రమాలకు కూడా ఉపయోగిస్తున్నారని స్థానికులు కోరుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎంతో నాణ్యంగా నిర్మించిన ఈ భవనాన్ని వినియో గంలోనికితీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## ఎమ్మెల్యేతో రాపూరు మండల టిడిపి నేతల భేటి



**రాపూరు, జూన్24ప్రభాతవార్త :** వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో సోమవారం రాపూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బేటి అయ్యారు. వెంకటగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, నాయకులు నల్లవడ్ల రమణా రెడ్డి, మూరంరెడ్డి మధుసూధన్ రెడ్డిలు సమావేశమై మండల అభివృద్ధికి సంబందించినపలు విషయాలపై చర్చించారు. మండల పార్టీ ఆధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి పార్టీ సమావేశమై మండలంలో పెండింగ్‌లో వున్న సమస్యలపై ఆయనతో చర్చించారు. త్వరలో మండలంలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నాయకులకు తెలిపారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో తూమాయి సర్పంచ్ పైడిపూల చంద్రమోహన్, బోజ్జన పల్లి సర్పంచ్ ఏటూరు నాగభూషణం రెడ్డి, నాయకులు నల్లవడ్ల రాధాకృష్ణా రెడ్డి,కూకాటి పెంచలయ్య, మందాటి చంద్రమోహన్,చిన్నబ్బయ్య, రామయ్య, ప్రసాద్ రెడ్డి, బిల్లు వెంకటరత్నం,తిరుపతి పార్లమెంట్ నాయకుడు కోండ్లపూడి రాఘవ రెడ్డి,రాపూరు పట్టణ పార్టీ ఆధ్యక్షుడు ఎందోటి కోటి, నాయకులు దందోలు హరికృష్ణా రెడ్డి, బత్తిన శ్రీహరి రెడ్డి, రమణమ్మ, మాధవ రెడ్డి, ప్రకాష్ రావు, క్రిష్ణా రెడ్డి, పెద్దబ్బయ్య, దామోదర్ నాయుడు,గౌస్ భాషా,ఖాజా మోహిద్దీన్, రమేష్, పుల్లయ్య, రమణమ్మ, తదితరలున్నారు.

## ఉదయగిరిలో ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశం



**ఉదయగిరి, జూన్24, ప్రభాతవార్త :** ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి ముఖ్యకార్యకర్తల సమావేశం ఉదయగిరిలోని స్థానిక ఏబీఎన్ కాంపౌండ్ నందు ఎమ్మెస్పీ జాతీయ నాయకులు గొల్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జూలై 7వ తేదీన చలో వరంగల్ మాదిగల ఆత్మగౌరవ కవాతును జయప్రయం చేయాలని ఆదే విధంగా ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీలు ముగించుకుని మండల కమిటీలను ఎన్నుకోవాలని వాటికి తేదీలను ప్రకటించడం జరిగింది.28వ తేదీ ఉదయం 10గంటలకు సీతారమపురం మండల మధ్యాహ్నం 3గంటలకు ఉదయగిరి మండలం,29వ తేదీ ఉదయం 10గంటలకు వరికుంటపాడు మండలం,మధ్యాహ్నం 3గంటలకు దుత్తలూరు మండలం వేయాలని ఆయన నిర్ణయించారు.అదే విధంగా ఎమ్మెస్ ఎఫ్ కమిటీలను వేసి మాదిగలను అన్ని విధాలుగా కలుపుకుని పోయి కమిటీలను పూర్తి చేయాలని పిలుపునిచ్చారు.ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బకీర్ జాషువా మాట్లాడుతూ జూలై 7వ తేదీ వరంగల్లో జరుగు సభకు అందరూ డ్రెస్‌కోడ్‌ను వేసుకుని జూలై 6వ తేదీన అన్ని గ్రామాల్లో మండలాల్లో జెండాలు ఎగరవేసి ఎమ్మార్పీఎస్ పండగను జరుపుకోవాలని 7వ తేదీ వరంగల్లో సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెస్‌పి సీనియర్ నాయకులు గొల్లపల్లి మోహన్‌రావు మాదిగ, బెజవాడ బాల గురవయ్య మాదిగ,ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగపట్ల సింహాద్రి మాదిగ,కె.కిరణ్ మాదిగ, ఎమ్మెస్పీ నాయకులు బర్రె అర్జున్ మాదిగ,విజయ్ మాదిగ,రవి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## జిఎమ్‌కె ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థుల విద్యకు ప్రోత్సాహం



**ఉదయగిరి, జూన్24, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలం గండిపాలెం గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షులు,ప్రముఖ వ్యాపారవేత్త జిఎమ్‌కె ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థుల విద్యకు తన చేతనైన సాయం అదరిస్తూ వారిని ప్రోత్సహి స్తున్నారు. సమాజంలో అన్నదారం,విద్యాదానం గొప్పవి, అన్నదారం అందరూ చేస్తారు.విద్యను ప్రోత్సహించే వారిని వేళ్లమీద లెక్కించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడో ఒక్కరిద్దురు కనిపిస్తారు.ఆ వరుసలో జిఎమ్‌కె ఉన్నారని చెప్పొచు.గతంలో ఆయన గండిపాలెంజడ్పీ,ప్రాథమిక పాఠశాలలో పాటు పరిసర గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు బ్యాగులు,నోటుబుక్‌లు అందించారు.ఉన్నత పాఠశా లకు వచ్చే విద్యార్థులకు సంబంధించి ఆర్టీసీకి రవాణా చార్జీలు చెల్లించారు.తాజాగా ఆది, సోమ వారాల్లో గ్రామానికి చెందిన మేడిద నికిత, మెడబడిమి భూమిక చదువుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.20వేల వంతున కుటుంబ సభ్యులకు తన ట్రస్ట్ ప్రతినిధుల ద్వారా అందించారు.విద్యార్థుల కుటుంబ సభ్యులు ట్రస్ట్ సేవలను కొనియాడటంతోపాటు ట్రస్ట్ అధినేతకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

## కోవూరుపల్లి చెరువులో ఆక్రమణల తొలగింపు



**బిట్రగుంట, జూన్ 24 ప్రభాతవార్త :** బోగోలు మండలం కోవూరుపల్లి ఇరిగేషన్ చెరువులో సోమవారం ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జెసిబితో ఆక్రమణలు తొలగించారు. ఈ చెరువుని ఆనుకొని కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు రియల్ ఎస్టేట్ కోసం ప్లాట్లు వేసి చెరువులోని కొంత భాగాన్ని ఆక్రమించి ప్రహరీ గోడ నిర్మించడంతో దీనిపై ఆరోపణలు రావడంతో ఇరిగేషన్ శాఖ రెవెన్యూ సిబ్బందిచే సర్వే చేయించగా 2 ఎకరాల 87 సెంట్లు ఆక్రమణకు గురైందని నిర్ధారించడంతో ఈ ఆక్రమణలు తొలగింపుకు శ్రీకారం చుట్టారు.

## మండల కార్యాలయాలలో సియం, ఉప ముఖ్యమంత్రి ఫోటోలు



**బిట్రగుంట, జూన్ 24 ప్రభాతవార్త :** బోగోలు మండల పరిషత్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఫోటోలను సోమవారం ఏర్పాటు చేశారు. మండల టిడిపి కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సియం, డిప్యూటీ సియం, కావలి ఎమ్మెల్యే చిత్రపటాలను అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి ప్రధాన కార్యదర్శి ఎల్.సుధీర్‌బాబు, టిడిపి నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డిని కలిసిన యం.యస్.గౌడ్



**కావలి రూరల్, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి నియోజకవర్గ శాసనసభ్యులుగా దగుమాటి వెంకట కృష్ణారెడ్డి (కావ్య కృష్ణారెడ్డి) అఖండ విజయం సాధించి ప్రమాణస్వీకారం చేసి కావలి పట్టణానికి విచ్చేయడంతో సోమవారం జిల్లా గౌడ సంఘం కమిటీ సభ్యులు, కావలి మండలం తుమ్మలపెంట తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి యం.యస్.గౌడ్ మండల గౌడ సంఘం నేతలతో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పూలబొకె అందజేసి దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యంయస్ గౌడ్ మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో ఇంత వరకు ఎవరు సాధించలేని 30 వేల పైచిలుకు మెజార్టీ సాధించి కావలి నియోజకవర్గ ప్రజల మన్ననలు కావ్య పొందారన్నారు. కావలి నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని తూచతప్పకుండా నెరవేర్చి అండగా వుంటారన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో వుంటూ వారి సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నేతలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టిన రోజు సందర్బంగా గిరిజనులకు అన్నదానం



**కావలి రూరల్, జూన్ 24 ప్రభాతవార్త :** కావలి పట్టణానికి చెందిన వింజమూరులో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఒట్టూరు శ్రీనివాసులు, నీరజ దంపతుల కుమారుడు, కోడలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా జర్మనీలో పనిచేస్తున్న ఒట్టూరు నవ్యతేజ, శరణ్య దంపతుల కుమారుడు ఒట్టూరు లిషాన్‌రామ్ 2వ పుట్టిన రోజు సందర్బంగా సోమవారం కావలి రూరల్ మండలం సర్వాయపాళెం గిరిజన ప్రాంతంలో వున్న పేదలకు అన్నదానం చేశారు. సంయుక్త సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా దాత కుటుంబ సభ్యులు ఆత్మకూరి కల్లయ్య మాట్లాడారు. రెండవ పుట్టిన రోజు జరుపుకుంటున్న లిషాన్‌రామ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందజేశారు. సంస్థ సభ్యులు గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ కావలి పట్టణ నివాసులు వృత్తిరీత్యా జర్మనీలో వుంటున్న ఒట్టూరు నవ్యతేజ, శరణ్య దంపతుల కుమారుడు లిషాన్‌రామ్ పుట్టిన రోజు సందర్బంగా నిరుపేద గిరిజనులకు అన్నదానం చేయడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఎఎస్ఐ శ్రీనివాసులుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఎఎస్ఐ శ్రీనివాసరావు, ఒట్టూరు నవ్యతేజ, శరణ్య, చిత్రకల్పన, సంస్థ సభ్యులు మల్లేశ్వరరావు, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర,తదితరులు పాల్గొన్నారు.

## హంతకులను, రేపిస్టులను తాట తీసే పార్టీ



**నెల్లూరు, జూన్ 24, ప్రభాతవార్త – వైద్యం :** చీరాల మండలం ఈపురుపాలెంలో సుచరిత అనే మహిళపై ఆమె బహిర్భూమికి వెళ్ళగా ముగ్గురు యువకులు ఆమెను పొదల్లోకి తీసుకుని వెళ్లి అత్యాచారం చేసి హత్య చేయడం బాధాకరమని, వారి కుటుంబానికి తెలుగు మహిళల తరపున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నెల్లూరు పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి తెలిపారు. సోమవారం నగరంలోని టిడిపి కార్యాలయంలో పనబాక భూలక్ష్మి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అదే విధంగా సంఘటన జరిగిన వెంటనే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి రాగా తక్షణమే హోం మినిస్టర్ వంగలపూడి అనిత వెంటనే స్పందించి ఆ ప్రదేశమునకు వెళ్లి నిందితులను 48 గంటల్లోనే పట్టుకోవాలని పోలీసులకు ఆదేశించారు. ఇంకా ముందే నిందితులను 36 గంటలలో అరెస్టు చేయడం జరిగిందన్నారు. హోమ్ మినిస్టర్ తక్షణమే స్పందించిన తీరు అలాగే గంజాయి డ్రగ్స్ మీద ఉక్కుపాదం మోపే విధంగా మహిళలకు రక్షణగా ఉంటామని మహిళకు రక్షణ తీసుకొస్తామని తెలియజేయడం హర్షనీయమన్నారు. ఆమెకు మహిళల తరపున తెలుగు మహిళలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఆమె అన్నారు. చంద్రబాబు తన పాలనలో ఏ ఒక్క ఆడబిడ్డ బలి కాకూడదు. అన్యాయం జరగకూడదనేదే ఆయన సంకల్పమని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంలో మహిళలపై అత్యాచారాలు, దాడులు లక్షకు పైబడి జరిగిన ఆనాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేసినటువంటి పరిస్థితి లేదని ఆమె ఆరోపించారు. ఆడబిడ్డపై అత్యాచారాలు, దాడులు చేసిన వారికి దిశా చట్టం కింద ఉరిశిక్ష అన్నారు. ఒక్కరికైనాశిక్ష విధించారా అని పనబాక ప్రశ్నించారు. జగన్ సొంత నియోజకవర్గంలో పులివెందులలో ఎస్సీ కులానికి చెందిన నాగమ్మని అత్యాచారం చేసి దారుణంగా చంపేసినా వారిని ఇప్పటి వరకు శిక్షించలేదన్నారు. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన టిడిపి ఎస్సి నాయకులు అనిత, ఎంఎస్ రాజులపై ఎస్సి, ఎస్టీ కేసులు పెట్టడం హేయమన్నారు. వైసిపి ప్రభుత్వంలో ప్రాణ, మానాలకు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని భూలక్ష్మి విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో ఒకరికి, ఇద్దరూ హోమ్ మినిస్టర్లుగా పని చేశారు. హోమ్ మినిస్టర్ సుచరితగా దిశాదశ అన్నారు. ఇంటికి పరిమితమయ్యారని విమర్శించారు. మహిళా కమిషనర్‌గా వాసిరెడ్డి పద్మ జగన్మోహన్ రెడ్డి ఇంట్లో మహిళలకు కమిషనర్‌గా పనిచేసారే తప్ప? ఏ రోజు రాష్ట్ర మహిళలు గురించి మాట్లాడిన పరిస్థితులు లేవని ఆమె మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియమించిన హోమ్ మినిస్టర్ వంగలపూడి అనిత తప్పు చేసిన వారిని తాట తీసే రకమని గతంలో హోమ్ మినిస్టర్స్‌లాగా తప్పించుకునే రకం కాదన్నారు. గడిచిన ఐదు సంవత్సరాల వైసిపి పార్టీలో మద్యం, డ్రగ్స్, గంజాయి, డ్రగ్స్‌లను కట్టడి చేసి సుచరిత లాంటి మరో ఆడబ్డి బలికాకుండా తప్పు చేసిన వాడిని వెన్నులో వణుకు పట్టేలా కఠినమైన శిక్షలు విధించి ఆడబ్డిలను కాపాడాలని ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి కోమరి విజయమ్మ, పార్లమెంట్ మహిళా అధికార ప్రతినిధి మంగమ్మ, పార్లమెంట్ టిడిపి మహిళా ఆర్గనైజ్ సెక్రటరీ శ్రీదేవి, పార్లమెంట్ మహిళా సెక్రటరీ సెల్వి మహిళా నాయకులు శాంతి, రాజీ, ధనలక్ష్మి, కాంతమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## బడియీడు పిల్లలందరు పాఠశాలలో వుండాలి



**జలదంకి, జూన్24, ప్రభాతవార్త :** చిన్నారుల బంగారు భవితకై ప్రభుత్వం బడియీడు పిల్లలందరు బడులలో వుండాల్సిందేనన్న మహత్తర కార్యక్రమం చేపట్టి అమలుచేస్తుంది. దీనిలో అందరు భాగస్వాములై ఆరునుంచి పద్నాలుగు ఏళ్ళ బిడ్డల్ని పాలశాలలో చేర్పించేందుకు కృషిచేయాలని మండలాధ్యక్షుడు గోచిపాతల వెంకటరమణయ్య పిలుపునిచ్చరు. సోమవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో నేను బడికిపోతా అన్న కార్యక్రమంపై అవగాహనాకార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగ ఎంపిపి మాట్లాడుతు పేదపిల్లలకు చదువే ఆయుధం వారి జీవితాలు బాగేసడాలంటే చదువక్కటే మార్గమన్నారు. పలకా, బలపం చేపట్టి బడికివెళితే చదువులకై ప్రభుత్వం ఎంతో ప్రోత్సామమిస్తుందని అన్నారు. కావున తల్లి, దండ్రులు తమ బిడ్డల్ని తప్పక బడులకు పంపాలన్నారు. ఉపవిద్యాశాఖాదికారి రఘురామయ్య మాట్లాడుతు అర్హతకల చిన్నారులను బడులలో చేర్పించేందుకు ఒక నిబద్దతతో పనిచేయాలని అన్నారు. ఈనెల 13నుంచి వచ్చేనెల 14వరకు దీని విజయవంతానికై ఏదోవక కార్యక్రమం చేపట్టి సక్సస్ చేయాల్సి వుంటుందన్నారు. కావున ఎక్కడ నిర్లక్ష్యానికి తావివ్వకుండ నేను బడికిపోతాకు సహకరించాలని కోరారు. అనంతరం పాఠశాల నుంచి ప్లకార్డులు చేబూని బస్టాండ్ సెంటర్‌వరకు ర్యాలి చేశారు. ఈసందర్భంగ నినాదాలు చేశారు. కెయురోడ్ వెంబడి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞచేశారు. ఈకార్యక్రమంలో ఎంఇఓలు శ్రీధర్, నాగేశ్వరరావు, ప్రధానోపాద్యాయుడు కొండారెడ్డి, సచివాలయ సిబ్బంది, ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంటురోగాలు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎక్కడా కూడా ప్రస్తుత సీజన్‌లో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండడమే కాకుండా మంచినీటి పైప్‌లైన్ లీకేజీపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ఎంపీడీవో శ్రీరామాంజనేయులు పేర్కొన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో పర్యటిస్తూ ఎక్కడైనా మంచినీటి పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే వాటికి మరమ్మతులు చేయించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లీలాప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించే సమయంలో ప్రస్తుతం సీజన్‌లో వచ్చే వ్యాధులపై వారు అవగాహన పెంచేలా దృష్టి పెట్టాలన్నారు. పారిశుధ్యం విషయంలో మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేలా సమిష్టి కృషి అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్, ఈవోపీఆర్డీ నాగూర్‌వలి పలు సూచనలు చేశారు.

## ఆకట్టుకున్న నేను బడికి పోతా ర్యాలీ



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** కోవూరు మండలం గుమ్మలదిబ్బ గ్రామంలో సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో నేను బడికిపోతా సంబంధించి గ్రామ పురవీధుల్లో భారీ ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి –2 వై. చెంచులక్ష్మమ్మ మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ తప్పక బడిలో ఉండాలన్నారు. పిల్లలను పనులకు పంపడం చట్టరీత్యా నేరమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు తమ బిడ్డలను చక్కగా చదివించాలన్నారు. సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే చదువు ఒక్కటే కీలకమన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బడి ఈడు కలిగి బడి బయట ఉన్న పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలో చేరాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిరావతి, ఉపాధ్యాయులు మల్లికార్జున, జయప్రకాష్, అజయ్‌కుమార్, వేణుగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ హధుసూదన్‌రావు, సీఆర్‌ఎంటీ శ్రీనివాసులు, గంగాధర్, విద్యార్థులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్దులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను ఆ కేంద్రాల పరిధిలోని తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక తెలిపారు. కోవూరులోని పెళ్లకూరు కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆట పాటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా చిన్నారులకు బలవర్ధకమైన పాలు, గుడ్లు, పౌష్టికాహారం కూడా అందజేయడం జరుగుతుందన్నారు. ఇవే కాకుండా కేంద్రాల పరిధిలో ఉన్న గర్భవతులు, బాలింతలు కూడా ప్రభుత్వం అందించే బలవర్ధకమైన పౌష్టికాహారం కూడా అందజేయడం జరుగుతుందని, దీనిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

# సమాజాభివృద్ధిలో చదువే కీలకం



**కోవూరు, జూన్ 24 ప్రభాతవార్త :** సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించాలంటే చదువే కీలకమని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి చదువు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని ప్రధానోపాధ్యా యులు నరసింహమూర్తి తెలిపారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె. ఉమాదేవి పదవీ విరమణ చేశారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమాదేవి గత మూడు దశాబ్దాలకు పైగా పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ అనేకమంది విద్యార్థులను తీర్చిదిద్దార న్నారు. ఇటువంటి అంకితభావం ఉన్న ఉపాధ్యాయులు పదవీ విరమణ చేయడం బాధగా ఉన్న ప్రభుత్వ శాఖలో పనిచేసే వారు ఎప్పుడోకప్పుడు పదవీ విరమణ చేయడం తప్పదు. అయితే తమ ఉద్యోగ విషయం లో తపన, బాధ్యతగా పనిచేసే వారికి ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని, అందుకు నిదర్శనమే ఉమాదేవి అని కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ఆధ్వర్యంలో ఉమాదేవి దంపతులను భారీ పూలమాల, పురస్కారాలతో ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా పెద్ది ప్రభావతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదవీ విరమణ చేసిన ఉమాదేవిని శాలువా, మెమెంటో, గిఫ్ట్‌తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పి. హితేష్, వి. నిఖిల్, ఉపాధ్యాయులు, సన్మాన గ్రహీత బంధుమిత్రులు పాల్గొన్నారు.

## ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ



**బిట్రగుంట, జూన్ 24 ప్రభాతవార్త :** బోగోలు మండలం పాతబిట్రగుంట గిరిజన కాలనీలో సోమవారం వివిధ వ్యాధులకు సంబంధించి రోగులను జలదంకి మండలం చినక్రాక ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆయుర్వేద మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరులో పినాకిని దేహ సమర్పకుల సంస్థ

**నెల్లూరు, జూన్24, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలో దాదాపు 24ఏళ్ళ తర్వాత పినాకిని సంస్థ కృషిమేరకు పినాకిని దేహ సమర్పకుల సంస్థను ఏర్పాటుచేసినట్లు ఆసంస్థ నిర్వాహకులు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు నగరంలోని రెడ్‌క్రాస్‌సంస్థ కార్యాలయంలో ఈనెల23న విశ్రాంత ఉపాద్యాయులు పి విజయ, ప్రముఖ న్యాయవాది మద్దలూరి బ్రహ్మం అద్యక్షతన జరిగిన సమావేశంలో సింహపురి దేహ సంమర్ప కుల సంస్థ ఏర్పాటైంది. వీరితోపాటు స్వశ్చందంగ డాక్టర్ మేకల వెంకటరమణయ్య, ఎస్‌కె ఖాలేషా, కె దినకర్‌తోపాటు మరో పదిమందితో కలసి కార్యనిర్వాహక కమిటి ఏర్పడింది. వీ రందరి సహకారంతో ఏర్పడిన దేహ సమర్పణలో భాగంగ రక్త, నేత్ర, అవయవ శరీర భాగాలను సమర్పణలను కలుపుకొని పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఈసంస్థ ఏర్పాటువలన జిల్లాలో మరో దేహ సమర్పకుల సంస్థ ఏర్పాటు కావడం తో దీనికి ఒక మహిళ ముందుకు రావడంపట్ల పలువురు హర్షంవ్యక్తంచేస్తున్నారు. ఆమె ప్రయత్నంలో మరికొన్ని సంస్థలుకూడా వీటిని విరివిగ ఏర్పాటుచేసి రాష్ట్రంలో ఒక వినూత్న సమాజ ఉపయోగానికి సంస్కృతి వికాశానికి మార్గం ఏర్పడాలని పలువురు ఆక్షాంక్షిస్తున్నారు.

## టిడిపి నేత దానమయ్య మృతి



**సీతారామపురం జూన్ 24 ప్రభాతవార్త :** మండలంలోని మారంరెడ్డిపల్లి గ్రామంలో టిడిపి సీనియర్‌నాయకులు కలివెల దానమయ్య మృతి చెందారు. ఈవిషయం తెలుసుకొని టిడిపినాయకులు దానమయ్య పార్థివదేహాన్ని సందర్శించి ఆయన మృతికి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతు కలివెల దానమయ్య గ్రామానికి తీరనిలోటు అని వారు పేర్కున్నారు.

## నీటి ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన సదస్సు



కావలి రూరల్, జూన్ 24 ప్రభాతవార్త కావలి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం నందు సోమవారం ఎంపిడివో శ్రీధర్‌బాబు అధ్యక్ష తన రానున్న వర్షాకాలం దృష్ట్యా నీటి ద్వారా వచ్చే వ్యాధులు, డయేరియా వ్యాధిపై కావలి ఆర్డబ్ల్యుఎస్ ఎఇ కృష్ణచైతన్య కావలి మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు, వైద్య ఆరోగ్య సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇ కృష్ణచైతన్య పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రానున్నది వర్షాకాలం అయినందున నీరు కలుషితమయ్యే ప్రమాదం వున్నందున నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపర్చుకునే విధంగా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు.

## రెడ్డి జనసేవా సంఘంచే శ్రీ వీర అభయ ఆంజనేయ స్వామి ఉత్సవానికి ఆహ్వానం

**పొదలకూరు, జూన్ 24, ప్రభాతవార్త** పట్టణంలోని మారుతీ నగర్‌లో వెలసిన శ్రీ వీర అభయ ఆంజనేయ స్వామి జయంతి అనంతరం జరుగు మంగళవారం ఉత్సవాలలో భాగంగా నాలుగవ మంగళవారం ఒరెడ్డి జనసేవా సంఘం వారి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఉదయం 5 గంటలకు అభిషేకం, 8 గంటలకు ఆకు పూజ కార్యక్రమం, ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్న ప్రసాద వినియోగం జరుగుతుందని అనంతరం సాయంకాలం 7 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం భాజా భజంత్రీలు, విద్యుత్ దీపాలంకరణలతో బాణాసంచా మోతలతో ప్రొద్దుటూరు వారి చెక్క భజన, కోలాటంలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరు పాల్గొని స్వామి వారి కృప పొందాలని రెడ్డి జనసేవా సంఘం వారు కోరారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలు కండి



**ముత్తుకూరు, జూన్24, ప్రభాతవార్త** రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఆదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జిజేరావు పిలుపునిచ్చారు. సోమవారం ఆదాని కృష్ణపట్నం పోర్టు ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని సీఓఓ రాజన్‌బాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. రక్తం చాలా విలువైందని, ధనంతో కొనగలిగేది కాదని ఆరోగ్యవంతమైన ప్రతి ఒక్కరు రక్తదాతలు కావాల్సినఅవసరం ఎంతైనా ఉందన్నారు. ఆపదలో ఉన్నవారు రక్తం దొరకక చాలా ఇబ్బంది పడుతుంటారని, అటువంటి వారికి రక్తదానం చేయడం వలన వారి ప్రాణాలు కాపాడిన వారు అవుతారని తెలిపారు. ఆదాని కృష్ణపట్నం పోర్టు సామాజిక బాధ్యతలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ముఖ్యంగా పోర్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 283మంది రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ సర్టిఫికెట్లు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఓఓ రాజన్‌బాబు, అడ్మిన్‌హెడ్ గణేష్‌శర్మ, ఈహెచ్‌ఎస్ ఏజిఎం వేణుగోపాల్‌రెడ్డి, సెక్యూరిటీహెడ్ వెంకటేష్ భాస్కరన్, అకౌంట్స్ హెడ్ గుడివాడ శ్రీకాంత్, ఆదాని ఫౌండేషన్ హెడ్ రాజేష్ రంజన్, మనీష్ దావే, ముత్యంజయరాం, గంగా సతీష్, మధు, రాంబాబు. శ్రీనివాస్, నాగేశ్వరరావు, రామకృష్ణ, జైలాల్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు మధు సూధన్‌రావు, భాస్కర్, సాయిరాం, పోర్టులోని వివిధ విభాగాలు హెచ్వోడీలు, ఉద్యోగులు, అడ్మిన్, ఈహెచ్‌ఎస్ టీం ప్రతినిధులు పాల్గొన్నారు.

## దేవదాయశాఖ మంత్రిని కలిసిన చేజర్ల బిజెపి నేతలు



చేజర్ల జులై 24 ప్రభాతవార్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి వర్యులు ఆనం రామనారాయణ రెడ్డిని జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్య ఆధ్వర్యంలో బిజెపి నేతలు కలవడం జరి గింది. ఈ సందర్భంగా విజయవాడలో దేవాదాయశాఖా మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆనం రామ నారాయణరెడ్డిని మండల బిజెపి నేతలు కలిసి శాలువాలతో సత్కరించి పుష్పగుచ్చం అందజేశారు. మంత్రి ఆనం బిజెపి నేతలను ఆప్యాయంగా పలకరించారు. బిజెపినాయకులు కుంకు బాలయ్య నాయుడు, మండల బిజెపి అద్యక్షులుగుండాలవిజయభాస్కర్‌రెడ్డి, అల్లంపాటిరంగారెడ్డి, అల్లంపాటి నారాయణరెడ్డి తదితర నేతలున్నారు.

## లేబాకుల మరణం సమాజానికి తీరని లోటు



**కావలి, జూన్ 24 ప్రభాతవార్త** ఆంధ్రాబ్యాంక్ మేనేజర్‌గా సేవలందించి, స్వచ్ఛంద పదవీ విరమణ చేసి 20 ఏళ్ళ క్రితం బాలసుబ్రమణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అకాడమి(బామా) సంస్థను నిర్వహించిన లేబాకుల మరణం సమాజానికి తీరని లోటు అని కావలి ఉమెన్ ఫోర్స్ కన్వీనర్, వివిధ సంఘాల బాధ్యురాలు చాకలకొండ శారద తెలిపారు. బామా సుధాకర్‌రెడ్డిగా పేరు గడించారన్నారు. డాక్టర్ బెజవాడ రవికుమార్, తదితర మిత్ర బృందంతో బామాను స్థాపించి రెండు దశాబ్దాలుగా కావలిలో సంగీత విభావరిలు నిర్వహించి ప్రత్యేకతను చాటిచెప్పారన్నారు. వివిధ రంగాల్లోని ప్రముఖులైన కళాకారుల్ని కావలికి పరిచయం చేసిన వ్యక్తి లేబాకుల అని తెలిపారు. ఆయన ఆకస్మిక మరణం అత్యంత విచారకరమన్నారు. తల్లి ఆదిలక్ష్మమ్మ, తండ్రి నారాయణరెడ్డిల పేరుతో నా ఫౌండేషన్ సంస్థను ఏర్పాటు చేసి ఎంతోమందికి స్వీయ నిధులతో పెన్షన్లు అందజేశారన్నారు. విశ్వోదయ వ్యవస్థాపకులు డాక్టర్ దొడ్ల రామచంద్రారెడ్డి విగ్రహ స్థాపనలో కృషి చేసిన వ్యక్తి అన్నారు. తాను రచించిన కావలి తథాగతుడు డాక్టర్ డిఆర్ పుస్తక ప్రచురణలో సూచనలు అందజేసి ప్రోత్సహించారన్నారు. సోదరుడు లేబాకుల మృతికి ఆమె శ్రద్ధాంజలి ఘటించారు.

## ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వినతిపత్రం



**నెల్లూరు అర్బన్, జూన్24, ప్రభాతవార్త** : ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ జియాఉల్‌హక్ ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌ని కలిసి సాతంత్ర సమర యోధుడు మైసూర్ మహారాజ్, టిప్పు సుల్తాన్ విగ్రహం నెల్లూరు నగరంలో ఏర్పాటు చేయాలని కోరుకుంటూ వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైలానా అబ్దుల్ అజీజ్, సయ్యద్ సిరా జ్, ఇన్సాఫ్ అబ్దుల్ అజీజ్, హమీద్ హుస్సేన్, మున్నా, మొహమ్మద్ షాహుల్, వాజీద్, షఫీఉల్లా, ఇల్యాస్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి నమామిగంగే ఆధ్వర్యంలో కలెక్టర్‌కి వనతిపత్రం



**నెల్లూరు అర్బన్, జూన్24, ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించిన జగనన్న కాలనీల నాసిరకం గృహాల అవినీతిపై విచారణ జరపాలని బిజెపి నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ నెల్లూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరువెంకటేశ్వరపురంలో నిర్మించిన పక్కా గృహాలకు వందల సంఖ్యలో పగుళ్ళు ఏర్పడ్డాయి. హౌసింగ్ అధికారులు వైసీపీ పాలకులు కనుసన్నల్లో నాసిరకం గృహాలునిర్మించి అవినీతికి పాల్పడ్డారు. ఉన్నతస్థాయి అధికారులచే విచారణ జరిపించాలని బిజెపి డిమాండ్ చేస్తుంది. హౌసింగ్ అధికారులు, ఏఈలు, డిఇలు, కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి ప్రభుత్వం ఇచ్చిన స్టీలు, సిమెంట్ వినియోగించకుండా నాసిరకం గృహాలునిర్మించారు. కానీ ఎం.బుక్కులలో మాత్రం తగిన విధంగా స్టీలు, సిమెంట్ వినియోగించినట్లు రికార్డులు చేశారు. వాస్తవ పరిస్థితుల్లో ఒక్కొక్క గృహానికి స్టీలు బేస్‌మెంట్‌కు 340కేజీలు వినియోగించాల్సి ఉంటే 200కేజీలు మాత్రమే వినియోగించడం జరిగింది. సిమెంటు 30బస్తాలు వాడాల్సి ఉంటే 15బస్తాలు మాత్రమే వినియోగించారు. నాసిరకం గృహనిర్మాణాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంవత్సరాలుగా మూడు పర్యాయాలు ఫిర్యాదు చేసినా ఎటువంటి విచారణ జరపలేదు. అందువలన నేడు వందలసంఖ్యలో ఇళ్లకు పగుళ్ళు ఇచ్చాయి. జీవో నెంబర్ 9మార్గదర్శకాలు ప్రకారం భూమి లోపలికి ఆగర్లతో బల్లు సిస్టం అమలు చేయాల్సి ఉంటే ఆ విధానాన్ని హౌసింగ్ ఏఈ, డిఈలు ఉద్దేశపూర్వకంగా అమలుచేయలేదు. ఈ కారణం చేత కూడా ఇంటి బరువు పెరగడం వలన గృహాలు భూమిలోకి కుంగాయి. ఈ సమస్యలపై వెంటనే విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరు నాగేంద్ర సింగ్, దాసరి రాజేంద్ర ప్రసాద్, ఓ.సుధాకర్, నారాయణ యాదవ్, సునీల్‌రెడ్డి, ఉడత ప్రభాకర్, నటకరాని జయచంద్ర, బెల్లంకొండ రామకృష్ణ, బి.నారాయణరావు, కేశవ కళ్ళు భాస్కర్, నెల్లూరురత్నం పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కురుగొండ్లతో సిహెచ్‌సి వైద్యుల సమావేశం



రాపూరు, జూన్24ప్రభాతవార్త వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను సోమవారం రాపూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. వెంకటగిరిలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయనను కలసిన వైద్యులుఆయనకు పూల బోకే అందజేసి, శాలువా కప్పి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యసేవలను అందించి, ప్రభుత్వానికి మంచి పేరుతీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో ఆసుపత్రి ఇన్‌చార్జ్ డాక్టర్ నర్మదా దేవి, డాక్టర్ మమత, డాక్టర్ రేష్మా, డాక్టర్ నజ్మా, డాక్టర్ హరీష్, స్టాఫ్ నర్సులు పూర్ణిమా, బాగ్య, సిబ్బంది వెంకటేశ్వర్లు వున్నారు.

## రూరల్ బెధింపులు ఆపి.. అభివృద్ధి చేయండి :వైసిపి నాయకులు



**నెల్లూరు రూరల్, జూన్ 24, ప్రభాతవార్త** ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన విభిన్నమైన తీర్పును వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు మనస్ఫూర్తిగా గౌరవిస్తున్నామని రాష్ట్ర వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ కార్యదర్శి సిహెచ్ హరిబాబు యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నెల్లూరు రూరల్ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వైసిపి బిసి సెల్ కార్యదర్శి సిహెచ్ హరిబాబు యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వానికి, శాసనసభ్యులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన మంచి విజయాన్ని గొప్ప బాధ్యతగా తీసుకొని ప్రజలు ఆంక్షలను నెరవేర్చే విధంగా మంచి పనులు చేయాల్సిన గురుతర బాధ్యత గెలుపొందిన తెలుగుదేశం పార్టీ శాసన సభ్యులపై ఉందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. ఒకరికొకరు స్నేహపూర్వకంగా మెలగాల్సిన పరిస్థితులలో దాడుల సంస్కృతి మంచి పద్దతి కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన విజయంతో మూడవ సారి గెలుపొందిన తరుణంలో నెల్లూరు రూరల్ ప్రజలకు అనేక మంచి పనులు చేయాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. ప్రజలకు మేలు చేసే కార్యక్రమంలో తమందరం వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని ఆయన వెల్లడించారు. ప్రజలు మనకు ఇచ్చిన గొప్ప విజయాన్ని కాదని ప్రజాస్వామ్యంలో ఎన్నడు లేని విధంగా ప్రత్యర్ధి పార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపైన దాడులకు పాల్పడడం, బెదిరింపులు చేయడం అనేక మంచి సాంప్రదాయం కాదని కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్ర మాల మహానాడు వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో దివంగత నాయకులు కలిగి యానాదిరెడ్డి, నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరుల తర్వాత వరసగా ఒకే నియోజకవర్గం నుండి గెలిచిన ఎమ్మెల్యేగా రికార్డు సృష్టించేందుకు ప్రత్యేకంగా అభినందిస్తున్నామని, అయితే ఆ విజయంతో ఎంతో ఆదర్శంగా, హుందాగా రాజకీయాలు చేయాలిగాని, ఎప్పుడు లేని విధంగా ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులపైన కక్షసాధింపు ధోరణిలో హింసాత్మకమైన దాడులు చేయడం కరెక్ట్ కాదన్నారు. ప్రజా నాయకులు ఆదాల ప్రభాకర్ రెడ్డి లాంటి పెద్దమనిషి పైన కొందరు టిడిపి ద్వితీయ శ్రేణి నాయకులు అవగాహన లేని ఆరోపణలు చేస్తూ బురదచలడం మంచి పద్ధతి కాదన్నారు. ప్రజలు ఇచ్చిన మంచి విజయంతో రూరల్ నియోజకవర్గంలో మంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే మేము కూడా సంతోషించి ప్రశంసిస్తామని స్వర్ణ వెంకయ్య పేర్కొన్నారు. జిల్లా ఎస్టిసెల్ అధ్యక్షులు పాలకీర్తి రవికుమార్ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో గిరిజన బిడ్డలు తీవ్ర భయాందోళనలో ఉన్నారని, వారందరూ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం పాపమా? అని ప్రశ్నించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని గిరిజన బిడ్డలందరికి వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున జిల్లా వైసిపి ఎస్టి సెల్ విభాగంతో పాటు పార్టీ అధిష్టానం అంతా అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఏదిఏమైనా ఇటువంటి హింసాత్మకమైన దాడులు బెదిరింపుల సంస్కృతి మంచి పద్దతి కాదని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా వారికి నచ్చిన పార్టీకి ఓటు వేయడం మద్దతు పలకడం అనే హక్కు ఉందన్న విషయాన్ని అధికార పార్టీ శాసన సభ్యులు, నాయకులు తెలుసుకోవాలని నాయకులు అభిప్రాయపడ్డారు. మన పక్కనే ఉన్న సిటీ నియోజకవర్గ ఎంతో ప్రశాంతంగా ఉందని అక్కడ ఎటువంటి గొడవలు, దాడులు, రాజకీయ కక్షసాధింపులు, బెదిరింపులు, లేవన్న విషయాన్ని కూడా నెల్లూరు రూరల్ నియోజకవర్గం టిడిపి శాసన సభ్యులు, నాయకులు, కార్యకర్తలు గమనించాలని ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు వరుసగా మూడుసార్లు ఇచ్చిన విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని మరోసారి ఎమ్మెల్యేగా గెలిచేందుకు ప్రజల మద్దతు కూడగట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న విషయాన్ని కూడా టిడిపి నాయకులు గుర్తు పెట్టుకోవాలని ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు.

## ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం

**నెల్లూరు, జూన్24 ప్రభాతవార్త-విద్య** వాట్సప్(గ్రూపులు, ఆన్‌లైన్‌లల్లో బ్యాంక్ అధికారుల్లా మాట్లాడుతు ప్రజలను మెసగాళ్లు మెసం చేస్తున్నారని, అటువంటి ఆన్‌లైన్ మోసాలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్‌డిఎఫ్‌సి సెక్యూరిటీస్ సీడీఓ, సీఓఓ సందీప్ భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఆ శాఖలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు హెడిఎఫ్‌సి బ్యాంకింగ్, హెడిఎఫ్‌సి సెక్యూరిటీస్ లిమిటెడ్ సంస్థ తరపున వినియోగ దారులకు ఆన్‌లైన్ మెసాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. నకిలీ వాట్సప్ మేసేజ్‌లు, అవాంచిత లింక్స్‌ను ప్రజలు ఓపెన్ చేయకుండా ఉండటం మంచిదని పేర్కొన్నారు. తమ పెట్టుబడి దారులు అందరూ స్టాక్ మార్కెట్‌లో సూచనాత్మకమైన హీమి ఇవ్వబడిన, లేదా గ్యారెంటీడ్ రాబడి అందిస్తుందనే ఏ దైనా స్కీమ్ లేదా ప్రోడక్ట్‌కు సబ్‌స్క్రయిబ్ చేయకుండా ఉండటమే ఉత్తమమన్నారు. ఈ మెసపూరిత బృందాలు అధిక రాబడని యరగా చూపి వినియోగదారుల సున్నితమైన సమాచారాన్ని రాటడట్టం తోపాటూ వారి నిధులను లూఠీచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వినియోగ దారులు వారి ట్రేడింగ్, పాస్‌ఓడ్స్ వంటి వాటిని ఎవ్వరికి ఇవ్వవద్దని హెచ్చరించారు. అలాగే తెలియని ఆన్‌లైన్ లింక్‌లను కాకుండా తమ అధికారిక చానెల్ ద్వారా మాత్రమే లావాదేవీలను జరుపుకుకోవాలని ప్రజలు సురక్షితంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీధర్ అన్న నన్ను క్షమించు



నెల్లూరు రూరల్, జూన్ 24, ప్రభాతవార్త నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 34వ డివిజన్ ఇంచార్జి కార్పొరేటర్ భర్త రియాజ్ డివిజన్‌లోని ముస్లిముల కబరిస్తాన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్ అన్న నన్ను క్షమించు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రూరల్ నియోజకవర్గంలో వైఎస్‌ఆర్‌సిపి రూరల్ ఇంచార్జి ఆదాల ప్రభాకర్ రెడ్డి తన పై ఒత్తిళ్లకు గురిచేసి నాతో చేయకూడదని పనులు ఎన్నో చేయించారని దాంట్లో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సొంత నిధులతో కట్టించిన ముస్లిం స్మశాన వాటిక గోడపై శిలాఫలకాన్ని తీయించినట్లు ఆయన తెలిపారు. 14 ఏళ్లగా శ్రీధర్ అన్న వెనుక నడిచిన నన్ను వైసిపి నాయకులు భయపెట్టి బెదిరించి, శ్రీధర్ రెడ్డికి వ్యతిరేకంగా పనులు చేయించారని ఆయన అన్నారు. గతంలో శిలాఫలకాన్ని తీసేసిన తానే స్వయంగా శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి కోటంరెడ్డిని క్షమించమని ఆయన అభ్యర్థించారు. ప్రభుత్వం మారడంతో నా పై ఎలాంటి వత్తిళ్లకు గురి చేయలేరు కాబట్టే నేను ఈ పని మనస్ఫూర్తిగా చేస్తున్నానని ఆయన తెలిపారు.

## నెల్లూరు రూరల్ డిఎస్పి వీరాంజనేయ రెడ్డి బదిలీ

నెల్లూరు క్రైం, జూన్ 24, ప్రభాతవార్త నెల్లూరు రూరల్ డిఎస్పి వీరాంజనేయరెడ్డిని బదిలీ చేస్తూ రాష్ట్ర డిజిపి ద్వారకా తిరుమల రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన వెంటనే జిల్లా హెడ్ క్వార్టర్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. నెల్లూరు రూరల్ ఇన్చార్జి డిఎస్పిగా ప్రస్తుతం నెల్లూరు నగర డిఎస్పిగా ఉన్న శ్రీనివాసరెడ్డికి బాధ్యతలను అప్పగించారు.





## భారత కమ్యునిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం



నెల్లూరు అర్బన్, జూన్24, ప్రభాతవార్త : భారత కమ్యునిస్టు పార్టీ సిపిఐ నెల్లూరు నగర సమితి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కి వినతిపత్రం అందించారు. నెల్లూరు నగరంలో రూరల్ 2018లో ప్రయాణీకుల కోసం ఏసీ బస్ షెల్టర్ నిర్మాణం జరిగిందని ప్రజలకు అందుబాటులో వచ్చే సమయానికి ఎన్నికల వచ్చి గెలిచిన ప్రభుత్వం ఆ బస్‌షెల్టర్‌ని మరుగున పడేసింది అని దాదాపు 10బస్ షెల్టర్స్ కోటి రూపాయలతో నిర్మించి ప్రజాధనం వృధా కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. నగరంలో పాత మున్సిపాలిటీ ఆఫీస్ ఎదురుగా గోషా హాస్పిటల్ నిర్మాణం దాదాపు 5సంవత్సరాల నుండి పూర్తి కాలేదని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి రావాలని కోరారు. నగరంలోని కటారిపాలెంలోని కమ్యునిటీ హాల్ దాదాపు 5సంవత్సరాలు నుండి అలాగే మరుగున పడుతుందని కావున ఎస్సీ కమ్యునిటీ హాల్ పూర్తిచేయాలని ఈ సందర్భంగా కోరారు.

## వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన చేజర్ల బిజెపి నాయకులు



**చేజర్ల జులై 24 ప్రభాతవార్త** : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌యాదవ్‌ను చేజర్ల బిజెపి నేతలు కలవడం జరిగింది. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకర్గ శాసనసభ్యులు మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను విజయవాడలోని ఆయన నివాసంలో బిజెపి నేతలు కలిసి శాలువాలతో సత్కరించి పూల బొక్కేలు అందజేసి అభినందనలు తెలిపారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బత్తల కృష్ణయ్యను ఆప్యాయంగా పలకరించారు. జిల్లా సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. బిజెపి నేతలను పరిచయం చేసుకున్నారు. బిజెపి సీనియర్‌నాయకులు కుంకు బాలయ్యనాయుడు, మండల బిజెపి అద్య క్షులు గుండాల విజయభాస్కర్‌రెడ్డి, అల్లంపాటి రంగారెడ్డి, అల్లంపాటి నారాయణరెడ్డి తదితర నేతలున్నారు.

## పాఠశాలను పరిశీలించిన ఉప విద్యాశాఖాధికారి



సంగం, జూన్ 24, ప్రభాతవార్త : సంగం మండలం అన్నారెడ్డిపాళెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆత్మకూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి గోపాల్ ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అడ్మిషన్లు పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

## జిఓ నెం.117ను వెంటనే రద్దు చేసి ప్రభుత్వ బడులు కాపాడండి



**రాపూరు, జూన్24ప్రభాతవార్త :** ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం జిఓ నెం.117 ను రద్దు చేసి ప్రభుత్వ బడులను కాపాడాలని యూ.టీ.ఎఫ్ నాయకులు కోరారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫేడరేషన్ రాపూరు మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూ.టి.ఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డిసంబర్ నెలలో స్వర్ణోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని వాటిని జయప్రదం చేయాలని కోరారు. రాష్టంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వం విద్యా వ్యవస్థలో గల సమస్యలపై దృష్టి సారించి ఇచ్చిన మాట ప్రకారం జిఓ నెం.117ను రద్దు చేసి ప్రభుత్వ బడులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూ.టి.ఎఫ్ జిల్లా నాయకులు పి. హరిప్రసాద్ రెడ్డి, మండల నాయకులు బి.వెంకేశ్వర్లు, బి.అంకయ్య, కె.బాల ప్రసాదన, కె.రవికాంత్, యం. శ్రీనివాసులు, ఆర్.శ్రీనివాసులు, ఎ.శివసాయి తదితరులున్నారు.